



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

బిఇడి కళాశాలల్లో అవకతవకలు

- పేరుకు మాత్రమే కళాశాలలు - తరగతుల నిర్వహణ ఊసే లేదు
- ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అడ్మిషన్లు - వర్సిటీ పెద్దలను శాసిస్తున్న యాజమాన్యాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బిఇడి కళాశాలలో విద్యార్థి కళాశాల తరగతులకు హాజరు కాకపోయినా, బ్లాక్‌బోర్డు టీచింగ్ చేయకపోయినా కేవలం పరీక్షలు రాస్తే చాలు సర్టిఫికెట్ చేతిలో పడుతుంది. కళాశాల భవనాలు గాని ఎక్కడ కనిపించవు,కళాశాల పేర్లు మాత్రం బిఇడి అడ్మిషన్లు జరిగే సమయంలో వెబ్‌సైట్లో కనబడతాయి. ఇతర రాష్ట్రాల్లోని విద్యార్థులకు కూడా యథేచ్ఛగా సీట్లను కళాశాల యాజమాన్యాలు ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారు. వర్సిటీ అధికారులను శాసించే స్థాయికి కళాశాల యాజమాన్యాలు వెళ్లాయి. రాయలసీమ వర్సిటీలో 46 బిఇడి కళాశాలలు గుర్తింపు కలిగి ఉన్నాయి. ఈ కళాశాలలో మొత్తం 4350 సీట్లు ఉన్నాయి. 2023.24 విద్యా సంవత్సరంలో దాదాపుగా 3721 సీట్లకు అడ్మిషన్లు జరిగాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి.



కళాశాలలకు ఇష్టానుసారంగా అనుమతులు

వర్సిటీలోని బిఇడి కళాశాలలకు గుర్తింపు ఇవ్వడంలో ఉన్నతాధికారులు కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఈ కళాశాలలో తరగతి గదులు ల్యాబ్ లు వంటివి యాజమాన్యాలు కల్పించాలి. ఇవేమీ లేకపోయినా పేరుకు మాత్రమే కాగితాలపైనే ఉన్నటువంటి వాటికి ఇష్టానుసారంగా అనుమతులను ఇస్తున్నారు. ఒకవేళ గుర్తింపు కానీ ఇవ్వకపోతే కళాశాల యాజమాన్యాల అసోసియేషన్ కోర్టు మెట్లెక్కి దొడ్డిదారిన అనుమతులను పొందుతున్నారు. కళాశాలలకు గుర్తింపు ఇచ్చేందుకు యాజమాన్యాలు కూడా వర్సిటీ ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టచెబుతున్నారు. ఇందులో కళాశాల యాజమాన్యాల అసోసియేషన్ సంఘం నాయకులుగా చలామణి అవుతున్న వారు వర్సిటీ ఉన్నతాధికారులను శాసించే స్థాయికి ఎదిగిపోయారు. అవసరమైతే తమ మాట వినని అధికారులను బెదిరింపులకు గురి చేస్తున్న పరిస్థితి ఉంది. ఇటీవల కళాశాలల తనిఖీలకు వర్సిటీ ఓ ఉన్నతాధికారుల బృందాన్ని వేస్తే సదరు యాజమాన్యాల సంఘం ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీలోని ఓ ఉన్నతాధికారినే బెదిరించే స్థాయికి వెళ్లడం పట్ల కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది.

ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అడ్మిషన్లు

ఇతర రాష్ట్రాలకు చెందిన అనేకమంది విద్యార్థులకు కళాశాలలకు రాకపోయినా వారికి బిఇడి అడ్మిషన్లను యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. రూ .లక్ష నుండి మొదలుకొని రూ.50 వేలకు పైగానే ఒక్కో సీటును అమ్ముతున్నారు. ఈ విద్యార్థులు కేవలం పరీక్షల సమయంలో వచ్చి పరీక్షలు రాసి వెళ్తుంటారు. ఈ విద్యార్థులకు ఎలాంటి బ్లాక్ టీచింగ్, రికార్డులు రాసే అవసరం లేదు. కళాశాల యాజమాన్యాలు బ్లాక్ టీచింగుకు హాజరైనట్లు , రికార్డులు రాసినట్లు కూడా మార్కులు వేసేస్తున్నారు.



నిబంధనలను పాటించాల్సిందే
- ఎన్‌టికె.నాయక్, వర్సిటీ వైస్ ఛాన్సలర్

బిఇడి కళాశాల యాజమాన్యాలు వర్సిటీ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందే. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడ కూడా అవకతవకలు జరగకుండా చూస్తాం.

బిఇడి కళాశాలపై విచారణ చేయాలి
- రామకృష్ణ, వర్సిటీ ఎస్ఎఫ్ఐ కన్వీనర్



రాయలసీమ వర్సిటీలోని బిఇడి కళాశాలలో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. ఈ అవకతవకలను నిర్ధారించేందుకుగాను వర్సిటీ ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేయాలి. అనేక బిఇడి కళాశాలలు నియమ నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

గుండ్రేవుల, వేదవతి
ప్రాజెక్టులను చేపట్టాలి

- జిజిహెచ్‌ను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి
- పలు ప్రజాసంఘాలు
- జిల్లా విజన్ ప్రణాళిక అమలుపై అభిప్రాయాల సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా అభివృద్ధి చెందాలంటే వెంటనే గుండ్రేవుల వేదవతి ప్రాజెక్టుల పనులను చేపట్టి పూర్తి చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. శనివారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో జిల్లా విజన్ ప్రణాళిక అమలుపై పలు ప్రజాసంఘాలతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రామ్‌శంకర్ నాయక్, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఇక్బాల్ అహ్మద్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి, లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య సిఐటియు జిల్లా నాయకులు ఎం.విజయ రామాంజనేయులు, మహమూద్, కుమార్, ఖాజాబాషా, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప , రైతు స్వరాజ్యం వేదిక జిల్లా కన్వీనర్ పోతుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఆర్‌డిఎస్ వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను నిర్మించాలని, చెక్‌డ్యాములు ఏర్పాటు చేయాలని, పరిశ్రమలను స్థాపించాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలను అభివృద్ధి చేయాలని, ఉపాధి హామీ పథకం కింద పని దినాలను 200కు పెంచాలని, ఆదోని, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ,పత్తికొండ ప్రాంతంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పెట్టాలని కేంద్ర విద్యా సంస్థలను తీసుకురావాలన్నారు. కర్నూలు జనరల్ హాస్పిటల్‌ను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని సూచించారు. నిర్మాణ రంగంలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలక్ట్రానిక్, ఐటి ఇండస్ట్రీస్ తీసుకురావాలన్నారు. ఆదోని ప్రాంతంలో జీన్స్ పరిశ్రమను ఏర్పాటు చేయాలన్నారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్టును అభివృద్ధి చేయాలని, విజయవాడకు రైల్వే కనెక్టివిటీ పెంచాలని, కోడుమూరు ఎమ్మిగనూరు జాతీయ రహదారిగా మార్చాలని సూచించారు.. పిహెచ్‌సి సబ్ సెంటర్లలో 24 గంటలు డాక్టర్లు పనిచేసేలా చూడాలని, పశ్చిమ ప్రాంతంలో రెసిడెన్షియల్, ఎపి మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. తుంగభద్ర, హంద్రీ నదులను అనుసంధానం చేయాలని, చెరువులకు నీటిని లిఫ్ట్ చేయాలన్నారు. భూసార పరీక్షలను చేయాలని, ఉల్లి మార్కెట్‌ను విస్తరించాలన్నారు. సబ్సిడీ ద్వారా టార్పాలిన్‌లను ఇచ్చేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా జిడిడిపి రూ.47514 కోట్లతో రాష్ట్రంలో 14వ స్థానంలో ఉందని తెలిపారు.. జివిఎకు సంబంధించి జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రూ.17447 కోట్లతో 39.11శాతం సేవా రంగాల్లో రూ.17180 కోట్లతో 38.52శాతం పారిశ్రామిక రంగంలో రూ.9978 కోట్లతో 22.37శాతంతో ఉందని కలెక్టర్ వివరించారు. వ్యవసాయ రంగంలో 10వ స్థానంలో, సేవా రంగంలో 12వ స్థానంలో, పారిశ్రామిక రంగంలో 13వ స్థానంలో ఉందని తెలిపారు. జిల్లా తలసరి ఆదాయం రూ.1,74,932 లతో రాష్ట్రంలో 19వ స్థానంలో ఉందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.7.97 లక్షల హెక్టార్ల జియోగ్రాఫికల్ ఏరియా ఉందని, ఇందులో 4.88 లక్షల హెక్టార్లు నికర విస్తీర్ణం కాగా, 1.06 లక్షల హెక్టార్ల విస్తీర్ణం నీటిపారుదల రంగం లో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకుగాను విజన్ 2047 ప్రణాళికను కూడా రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, వివిధ వర్గాలు, సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రహదారులను వేగవంతంగా
పూర్తి చేయాలి

- కలెక్టర్ రంజిత్ బాష
- నేషనల్ హైవే అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నేషనల్ హైవేకు సంబంధించిన రహదారులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నేషనల్ హైవే అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 40 భూ సేకరణకి సంబంధించిన నష్ట పరిహారాన్ని వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్ హెచ్ 340సికు సంబంధించి పసుపుల, రుద్రవరం గ్రామాలకు సంబంధించిన క్లెయిమ్స్‌ను త్వరగా పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ 340బికు సంబంధించి సోమయాజులపల్లె నుండి డోన్ రూట్‌కు సంబంధించిన క్లెయిమ్స్‌ను, ఎన్‌హెచ్ 167కు సంబంధించి ఆదోని బైపాస్ క్లెయిమ్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మంత్రాలయం బైపాస్‌కు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్ 340సి కి సంబంధించి బి. తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు జరుగుతున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులను నవంబర్ 15 తేది నాటికి పూర్తి చేయాలన్నారు.

‘విశాఖ ఉక్కు’ పరిరక్షణకు నిరసన దీక్షలు


ప్రజాశక్తి-కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో నిరసన దీక్షలు ఈ వారంలో మూడు రోజులపాటు కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో కొనసాగాయి. మొదటి రోజు 1న మంగళవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు చేశారు. రెండో రోజు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు చేశారు. మూడో రోజు రైతు, కార్మిక, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టాయి. ప్రయివేటీకరణ ఆపాలని, ఉద్యోగుల కొత్త రిక్రూట్‌మెంటు చేపట్టాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని తదితర నినాదాలు చేశారు. స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముందు నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అధికార పార్టీ పెత్తనం నశించాలని, అక్రమ బదిలీలు, వేధింపులు ఆపాలని, సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పత్తికొండ మండలం పుచ్చకాయాలమాడ గ్రామంలో పర్యటించారు. ఆయనకు ఎంపీలు, ఎమ్మెల్యేలు కర్నూలు ఉమ్మడి జిల్లా సమస్యలను వివరించారు. గుండ్రేవుల, వేదవతి తదితర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి కర్నూలు పశ్చిమ ప్రాంత తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయివేట్ మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వం ఈనెల 9 వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నది. 11న లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పాఠశాలలు, కళాశాలల మైదానాల్లో మొక్కలు నాటి పాలకులు ప్రచారం చేసుకుంటున్నారు. పేదలు నివసించే మురికివాడల్లో కనీసం డ్రెయినేజీల్లో కాలువల్లోని సిల్టును తీయలేని దుస్థితి కొనసాగుతుంది. మరోపక్క కాలనీల్లో చెత్తను సేకరించే క్లాప్ డ్రైవర్లకు నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదని కార్మికులు నిరసన తెలుపుతున్నా పాలకులకు పట్టడం లేదు. మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రధానంగా బదిలీలు, ప్రమోషన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్) ప్రారంభమమైంది. ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు కొనసాగుతున్నాయి. కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలు కేంద్రాల్లో కెవిపిఎస్ జెండాలను ఆవిష్కరించారు. కులవివక్షను రూపుమాపేందుకు పునరంకితం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. పిఎన్‌ఎం రాష్ట్ర నాయకుడు, రచయిత, ప్రజాగాయకుడు ఆర్‌.వాసు 8వ వర్ధంతి సభను నిర్వహించారు. పాట ఉన్నంత కాలం ఆర్‌.వాసు జీవించి ఉంటారని వక్తలు కొనియాడారు. ఉచిత ఇసుక పేరుతో ప్రచారం చేసుకోవడం కాకుండా నిబంధనలు సడలించి అందరికీ ఇసుకను అందుబాటులోకి తేవాలని సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. దసరా నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, తదితర ప్రముఖ ఆలయాల్లో వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా దేవరగట్టు బన్నీఉత్సవం ఏర్పాట్లకు కర్నూలు కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. విద్యార్థులకు దసరాకు సెలవులు ప్రకటించారు. విద్యార్థులు ఊళ్లకు వెళ్తుండటంతో బస్సులు, రైళ్లు కిటకిటలాడుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సిబిఎస్ఇ క్లస్టర్-7 ఫుట్‌బాల్ పోటీలకు కర్నూలు వేదికైంది. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు కర్నూలుకు వచ్చారు. ఈవారంలో అత్యధిక మండలాల్లో బదిలీపై వచ్చిన ఎంపిడిఒలు బాధ్యతలు స్వీకరించారు. అధిక వర్షాల తరువాత దిగుబడి వచ్చిన టమోటకు మార్కెట్లలో మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనగ విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.



ఆర్‌డిఒను కలిసిన రైతు సంఘం, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి సందీప్ కుమార్‌ను శనివారం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర కలిసి పలు సమస్యలను విన్నవించారు. గార్గేయపురం గ్రామం రైతుల పొలాలు నేషనల్ హైవే రోడ్డు కోసం తీసుకున్నారన్నారు. చాలామందికి నష్టపరిహారం అందలేదన్నారు. కొందరీ పొలాల్లో బోర్లు ఉన్నప్పటికీ డోర్లకు నష్టపరిహారం అందించలేదని ఆర్‌డిఒ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా ఈ మధ్యలో అలైన్‌మెంట్ మార్చడం వలన మరొక మూడున్నర ఎకరాలకుపైగా రైతుల భూములు కోల్పోయారని, వారికి నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే పనులు మొదలు పెట్టాల్సి ఉండగా వాళ్లకు ఏమాత్రం కూడా తెలియకుండా నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. వారందరికీ తక్షణమే నష్టపరిహారం చెల్లించేటట్లు బోర్లకు నష్టపరిహారం వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చెన్నై నుండి సూరత్‌కు పోవు రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. రైతులందరికీ నష్టపరిహారం అందేలాగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌డిఒ స్పందిస్తూ ఈ సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



సస్య ఆటో హీరో షోరూంలో
దసరా ధమాకా సేల్ ప్రారంభం

అదిరిపోయే క్యాష్ బోనస్‌లు -అతి తక్కువ డౌన్ పేమెంట్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని బళ్లారి చౌర స్తాలోని సస్య ఆటో హీరో షోరూంలో దసరా దమాకా సేల్ ప్రారంభ మైంది. ఈ దసరాకి శుభ ముహూర్తం వచ్చింది హీరోని మీ వెంట తెచ్చుకోండి అనే పేరుతో ఆఫర్స్ ఉన్నాయి. హెచ్‌ఎఫ్ డీలక్స్, స్ప్లెండర్ ,ఫ్యాషన్‌ప్రో, గ్లామర్ ఎక్స్ట్రీమ్ 125ఆర్ పై క్యాష్ బోనస్, ఫ్లిపికార్ట్ బుకింగ్ పై బోనస్ , ప్రత్యేకమైన డిస్కౌంట్‌లు ఉన్నాయన్నారు. పై వాహనాలకు అతి తక్కువ డౌన్ పేమెంట్ 8999 నుండి ప్రారంభమవుతుందన్నారు. ప్లెజర్ ,డెస్టినీ, కరిష్మా జెడ్‌ఎమ్‌ఆర్, మార్విక్ , ఎక్స్‌ఫెల్స్, విధ పై హీరో గుడ్ లైఫ్ ప్రయోజనాలు, ఫ్లిప్కార్ట్ బుకింగ్ పై క్యాష్ బోనస్ లు , ప్రత్యేకమైన డిస్కౌంట్ లు ఉన్నాయన్నారను. పై వాహనాలకు అతి తక్కువ డౌన్ పేమెంట్ 9999 నుండి ప్రారంభం.

సేవకు సంపదతో పనిలేదు

మానసిక వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేసిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సేవకు సంపదతో పనిలేదని, కేవలం సహాయం చేయాలన్న ఆలోచన ఉంటే చాలని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు ఆదిత్య విద్యా నిలయంలో కల్లూరు ఫోటో , వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కె. బాష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 60 మంది మానసిక వికలాంగులకు తనవంతుగా డాక్టర్ శంకర్ శర్మ పింఛన్లను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ఒక సాధారణ ఫోటోగ్రాఫర్ గా ఉన్న ఎస్‌కె.బాష కేవలం ఇతరులకు సహాయం చేయాలన్న ఆలోచనతో ప్రతినెల దాతల సహకారంతో పింఛన్లను పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. సేవకు సంపదతో పనిలేదని, కేవలం సాటివారికి సహాయం చేయాలన్న ఆలోచన ఉంటే చాలు అన్నది ఈ ఉదంతం నిరూపిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. మంచితనమే మానవత్వం... మానవత్వమే దైవత్వం అన్న సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించి ఇలాంటి కార్యక్రమాలకు సహకారం అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మానసిక వికలాంగులకు ప్రభుత్వం పింఛన్లను అందజేస్తున్నప్పటికీ సమాజంలోని ధనికులందరూ పేదలకు సహాయం చేసేందుకు తమ వంతుగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మన దేశంలో ధనికులకు పేదలకు మధ్య వ్యత్యాసం రోజురోజుకు పెరిగిపోతుందని,ఇలాంటి కార్యక్రమాల ద్వారా దానిని తగ్గించవచ్చని సూచించారు. అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కొంతమంది తమ ఆస్తులను సైతం పేదల కోసం త్యాగం చేసిన సందర్భాలు ఉన్నాయని వివరించారు. అట్టడుగు స్థాయిలో ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇలాంటి కార్యక్రమంలో తాను ఇప్పటికే మూడుసార్లు భాగస్వామిగా ఉన్నానని, రానున్న రోజుల్లో దాన్ని కొనసాగిస్తానని వివరించారు. కర్నూలు నగరంలో వైద్యుడిగా పేదలకు సేవలు అందిస్తూనే సామాజిక సేవ కార్యక్రమాల్లో తన వంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు. కల్లూరు ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కె.బాష ,ఆదిత్య విద్యా నిలయం కరస్పాండెంట్ వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు.


మానసిక వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కెవిఆర్ మహిళా డిగ్రీ , ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించామని రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని రెండు కళాశాలలో ఆయా డిగ్రీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న అడ్మిషన్లకు ఈనెల 7 నుండి 9వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించామని, అర్హులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉర్దూ విశ్వవిద్యాలయంలో

ఉర్దూవర్సిటీలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్స్ కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. లోకనాథ శనివారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ కొరకు ఉర్దూ యూనివర్సిటీ కార్యాలయంలో సంప్రదించగలరని తెలిపారు.

కోడుమూరు ఎంపిడిఒగా రాముడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్



కోడుమూరు ఎంపిడిఒగా రాముడు బాధ్యతలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని నా కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తిస్తానని తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సి బెలగల్ మండలం నుంచి బదిలీపై కోడుమూరుకు వచ్చినట్టు తెలిపారు. ఇక్కడి ఎంపిడిఒ చంద్రశేఖర్ రావు పాములపాడుకు బదిలీ పై వెళ్లారు.

కార్పొరేషన్ డైరెక్టర్‌గా డి.రామాంజనేయులు ప్రమాణం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఎపి స్టేట్ అర్బన్ ఫైనాన్స్‌ం ఇన్ఫెక్షన్ డెవలఫ్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా డి రామాంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్పొరేషన్ మొదటి సమావేశంలో డైరెక్టర్ డి రామాంజనేయులు మాట్లాడుతూ టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎగిగానన్నారు. నామినేటెడ్ పదవి ఇచ్చినందుకు ఆ పదవికి న్యాయం చేస్తానని, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌కు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి, నందికొట్కూరు ఇంచార్జి గౌరు వెంకటరెడ్డికి, పాణ్యం నియోజకవర్గ నాయకులకు, ముఖ్యంగా కల్లూరు మండల అన్ని గ్రామాల నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పిలగోవింద సత్యనారాయణను డైరెక్టర్ డి రామాంజనేయులు ఘనంగా సన్మానించారు. ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డి రామాంజనేయులును చైర్మన్ పిల గోవింద సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. ఐటిడిపి పాణ్యం అధ్యక్షులు వెంకటరమణ, ఎం.రంగారెడ్డి, డి.పాండు, మాదేశ్, ఉలిందకొండ ఇవి రమణ, కె. ధనుంజయ, పర్లశేఖర్, ఎంపిటిసి మేకల శేషన్న, ఆర్‌బి.కృష్ణ, బస్తిపాడురాజు, బొల్లవరం బివిజి మస్తాన్, నెరవాటి విజయ్, లక్ష్మన్న గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



నేడు ‘రవ్వలసడి’ ఆవిష్కరణ

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్



ప్రముఖ కవి వెంకటకృష్ణ రచించిన రాయలసీమ కవుల కవిత్వ వ్యాసాల సంకలనం ‘రవ్వల సడి’ ఆవిష్కరణ సభ ఆదివారం ఉ.10-00 గం.లకు టిజివి కళాక్షేత్రం సాహిత్య వేదికపై నిర్వహిస్తుస్తున్నామని సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ తెలిపారు. సభాధ్యక్షులుగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ఆవిష్కర్తగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె. సుభాషిణి, పుస్తకాన్ని అనంతపురంకు చెందిన కవి రచయిత డాక్టర్ అంకె శ్రీనివాస్ పరిచయం చేస్తారన్నారు. సభను కవిసమ్మేళనం సాహిత్య వేదిక నిర్వహకులు కవి కొత్తపల్లి సురేష్ నిర్వహిస్తారన్నారు.

పౌరాణిక నటులకు గుర్తింపునివ్వాలి

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

పౌరాణిక నటులకు గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని టిజివి కళాక్షేత్ర అధ్యక్షులు పత్తిఓబులయ్య అన్నారు. కర్నూలు టిజివి కళాక్షేత్రంలో రంగస్థల నటులు జి.సుబ్బారావు సంస్మరణ సభ నిర్వహించారు. సుబ్బారావు చిత్రపటానికి పుష్పాలను సమర్పించి కళాకారులు శ్రద్ధాంజలి ఘటించారు. కళా వాహిని కళాసంతా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రంగస్థల నటుడు మనోహర్‌బాబు మాట్లాడుతూ రాముడు కృష్ణుడు, ఆంజనేయుడు, విశ్వామిత్రుడు వంటి ఎన్నో పాత్రలు దాదాపుగా 40 సంవత్సరాల నుంచి నటిస్తున్న సుబ్బారావు మరణం కళా రంగానికి తీరనిలోటు ఉన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ పౌరాణిక నటులకు గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇకముందు తమకళాక్షేత్రంలో ప్రతి రెండవ ఆదివారం ప్రతినెల స్థానిక పౌరాణిక కళాకారులకు వేదికను కల్పిస్తామన్నారు. ఈనెల 20న యూట్యూబ్లో రంగస్థలంలో గుర్తింపు పొందిన మంగాదేవి హరిచంద్ర నాటకం ఉంటుందని తెలిపారు. పేద కళాకారులకు కళాక్షేత్రం అండదండలుగా ఉంటుందన్నారు. రంగస్థల కళాకారులు పి.దస్తగిరి, వివి.రమణారెడ్డి,నాగేశ్వరరావు, కరీంబాషా, చంద్రశేఖర్, భాస్కర్‌యాదవ్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శ్రీకృష్ణ రాయబారం లోని పడక శీను గయోపాఖ్యానంలోని యుద్ధ సన్నివేశాన్ని ప్రదర్శించారు.


సమావేశవంలో మాట్లాడుతున్న పత్తిఓబులయ్య



మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

ప్రశాంత వాతావరణంలో

దేవరగట్టు బన్ని ఉత్సవం జరుపుకోవాలి

- ఉత్సవ పర్యవేక్షణకు 100 సిసి కెమెరాలు, 5 డ్రోన్ కెమెరాల ఏర్పాటు

- పటిష్ట భద్రతకు చర్యలు - ఎస్పీ బిందు మాధవ్

ప్రజాశక్తి - హోళగుంద

ఈ నెల 12న జరగబోయే దేవరగట్టు బన్ని ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ జి.బిందు మాధవ్ సూచించారు. శనివారం హోళగుంద మండలం దేవరగట్టులో బన్ని ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, దేవస్థాన కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఈనెల 12న దసరా ఉత్సవాల్లో భాగంగా దేవరగట్టులో జరిగే శ్రీమాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలకు పటిష్టభద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బన్ని ఉత్సవంలో ఎలాంటి సమస్యలూ రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎవరూ గాయపడకుండా కానీ, ఇబ్బంది పడకుండా కానీ జరగకుండా ప్రశాంత వాతావరణంలో బన్ని ఉత్సవం జరుపుకోవాలని దేవరగట్టు బన్ని ఉత్సవ భక్తులకు సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతంలో కంటే ఈసారి ప్రశాంత వాతావరణంలో ఉత్సవం జరిగే విధంగా, చిన్న చిన్న సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బన్ని ఉత్సవ పర్యవేక్షణకు 100 సిసి కెమెరాలు, 5 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతమూ కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్రమ మద్యం సరఫరా, మద్యం అమ్మకాలు జరగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహశీల్దార్ ఎఎం.ప్రసాద్ రాజు, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ట్రెయినీ డీఎస్పీ ఉషశ్రీ, సిఐలు ప్రసాద్, కేశవరెడ్డి, శ్రీనివాస నాయక్, హోళగుంద ఎస్ఐ బాల నరసింహులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ, ఇఒఆర్‌డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నందవరం

నందవరం ఎంపిడిఒగా వి.పుల్లయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను అనంతపురం జిల్లా రూరల్ ఎంపిడిఒగా పని చేసినట్లు తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా నందవరం మండలానికి వచ్చినట్లు చెప్పారు. అలాగే ఇఒఆర్‌డిగా సందీప్ బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో డిటిగా మహేష్ బాధ్యతలు స్వీకరించారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

- డీఎస్పీ ఉపేంద్ర కుమార్ - ఘనంగా వైష్ణవ ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న కళాశాల యాజమాన్యం, అధికారులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని డీఎస్పీ ఉపేంద్ర కుమార్, పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి, వైష్ణవి కళాశాలల గ్రూప్ ఛైర్మన్ జీడి లింగప్ప, వైష్ణవి అకాడమీ ఛైర్మన్ జి.విష్ణు ప్రభు తెలిపారు. శనివారం వైష్ణవి గ్రూప్ నిర్వహిస్తున్న ఇంటర్, డిగ్రీ, ఎంబిఎ కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలు పట్టణంలోని వాసవి ఎసి కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు గురికాకుండా మంచిగా ఉండాలని కోరారు. ఈవ్‌టీజింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఫ్రెషర్స్ డే వేడుకల సందర్భంగా కళాశాల విద్యార్థులు ధార్మిక, జానపద, సాంస్కృతిక, సినీ పాటలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే నాటక దృశ్యాలు కూడా అలరించాయి. వైష్ణవి కళాశాల కరస్పాండెంట్ సత్య సిరి, వైష్ణవి కళాశాల డైరెక్టర్లు గంగన్న, జి.కనకనిధి, జి.జ్ఞాన సాయి కృతి, వైష్ణవి అకాడమీ కోఆర్డినేటర్ రవీంద్ర నాయక్, వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ కుమారస్వామి, మధుబాబు, మునెప్ప పాల్గొన్నారు.



వివిధ వేషధారణలో ఉన్న విద్యార్థులు

వేర్వేరు ఘటనల్లో నలుగురు చిన్నారులు మృతి

- నీటి గుంతలో పడి ముగ్గురు, పురుగు మందు తాగి ఒక చిన్నారి మృతి

ప్రజాశక్తి - నందవరం/ఎమ్మిగనూరు రూరల్

వేర్వేరు ఘటనల్లో నలుగురు చిన్నారులు మృతి చెందారు. నందవరం మండలం మాచాపురం గ్రామంలో నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఎమ్మిగనూరు మండలంలో నీటి గుంతలో పడి ఒక చిన్నారి, పురుగు మందు తాగి మరో చిన్నారి మృతి చెందారు.

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

నందవరం మండలం మాచాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. గ్రామస్తుల వివరాల మేరకు... మాచాపురం గ్రామానికి చెందిన బోయ జుట్ల భీమ శేఖర్, రామలక్ష్మి కుమారుడు బోయ జుట్ల హనుమేష్ (6), బోయ బైరె నడిపి రంగస్వామి, ఉరుకుందమ్మ కుమారుడు బోయ బైరె ఉదయ్ కిరణ్ (11), బోయ శ్రీనివాసులు కుమారుడు బోయ వంశీ, బోయ పాండు కుమారుడు బోయ చరణ్‌లు శనివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లారు. గ్రామ ఊరివెలుపల నందవరం రోడ్డులో ఉన్న బోయ బైరె అంజయ్య పొలంలో ప్లాట్లు వేశారు. హనుమేష్ కోసమని పొలంలో ఉన్న గుంతలోకి దిగారు. హనుమేష్ పొలంలో ఉన్న గుంతలోకి దిగి శుభ్రం చేసుకుంటూ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. రక్షించడానికి వెళ్లిన ఉదయ్ కిరణ్ కూడా గుంతలో పడి మునిగిపోయాడు. అక్కడ ఉన్న వంశీ, చరణ్‌లు రోడ్డు పైకి వచ్చి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు గుంతలో దిగి వెతికారు. గుంతలో పడి చనిపోయిన హనుమేష్, ఉదయ్ కిరణ్‌ను బయటకు తీసుకొచ్చారు. బోయ భీమేష్ కుమారుడు హనుమేష్ 1వ తరగతి చదువుతున్నాడు. ఉదయ్ కిరణ్ 6వ తరగతి చదువుతున్నాడు. ఇద్దరు చిన్నారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగు మందు తాగి చిన్నారి మృతి

ఎమ్మిగనూరు మండలం కె.నాగలాపురం గ్రామానికి చెందిన బి.భాస్కర్, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు బి.మహేంద్ర (5). మహేంద్ర, హరికృష్ణ (5)తో కలిసి ఆడుకుంటుండగా క్రిమిసంహారక మందు డబ్బా దొరకడంతో ఆడుకుంటూ ఇద్దరు కలిసి రసాయనాన్ని తాగారు. తర్వాత కడుపునొప్పి రావడంతో మహేంద్ర ఇంటికి వెళ్లి తల్లి జయలక్ష్మికి చెప్పాడు. హరికృష్ణ తల్లిదండ్రులు మహేష్, అనసూయలు అప్పటికే కూలి పనులకు వెళ్లారు. ఇద్దరూ దాయాదుల పిల్లలు కావడంతో మహేంద్ర తల్లి జయలక్ష్మి, ఇతరుల సహాయంతో ఇద్దరిని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మహేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కూలి పనికి వెళ్లిన మహేష్, అనసూయలకు గ్రామస్తులు విషయం తెలపడంతో వారు హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. కుమారుని చూసి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నీటి గుంతలో పడి చిన్నారి మృతి

ఎమ్మిగనూరు మండలం ఎస్.నాగలాపురం గ్రామానికి చెందిన సంపత్ కుమార్ (13) ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. మాణిక్యరావు, శాంత కుమారి దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో చిన్నవాడు 7వ తరగతి చదువుతున్న సంపత్ కుమార్ దసరా సెలవుల నిమిత్తం మండలంలోని అమ్మమ్మ గారి ఊరు పార్లపల్లి గ్రామానికి వెళ్లాడు. పార్లపల్లి గ్రామంలో బహిర్భూమి కోసం వంక గట్టు వైపు వెళ్లాడు. బహిర్భూమి అనంతరం కాళ్లు కడుక్కోవడానికి వంకలోకి దిగడంతో గుంత ఎక్కువగా ఉండడంతో జారి పడి మృతి చెందాడు.

పాము కాటుకు గురైన ఉపేంద్ర

మండలంలోని కడవెళ్ల గ్రామానికి చెందిన బి.ఉపేంద్ర పాము కాటుకు గురయ్యాడు. గ్రామస్తుల వివరాల మేరకు... బోయ శివ, బోయ పార్వతిల కుమారుడు బి.ఉపేంద్ర (10) 4వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో తల్లిదండ్రులతోపాటు పొలానికి వెళ్లాడు. పొలం గట్టులపై ఆడుకుంటుండగా పాము కాటుకు గురయ్యాడు. ఉపేంద్ర పాము కరిచిందని తల్లిదండ్రులకు తెలపడంతో వారు వెంటనే ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



నందవరంలో రోధిస్తున్న బంధువులు

రాయితీ శనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - హాలహర్వి

రైతులకు రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. శనివారం హాలహరి రైతు సేవా కేంద్రంలో రైతులకు శనగ విత్తనాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలానికి 3,250 క్వింటాళ్ల శనగ జేజీ 11 రకం కేటాయించినట్లు తెలిపారు. క్వింటా రూ.9,400 నిర్ణయించగా అందులో సబ్సిడీ రూ.2,350 పోను, రూ.7,050 రైతులు చెల్లించాలని చెప్పారు. దీనిపై మరింత సమాచారం కోసం స్థానిక రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. తహశీల్దార్ నజీమా భాను, డిటి లక్ష్మి, ఎంపిడిఒ వరలక్ష్మి, టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, బిజెపి మండల అధ్యక్షులు బసవరాజు, పాల్ రెడ్డి, శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

వీరభద్రగౌడ్‌కు సన్మానం

ఆలూరులోని టిడిపి కార్యాలయంలో టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌ను టిడిపి గూళ్యం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, జె.పంపన్న, జె.గాదిలింగ, శేషన్న, పూజారి మల్లి, శేఖర్ రెడ్డి, లక్ష్మీకాంత్, అమృతాపురం సోమశేఖర్ గౌడ్, గాది గౌడ్, నెరణికి మారెన్న, చాకలి నాగేంద్ర, భార్గవ్, గంగాధర్ పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న వీరభద్ర గౌడ్

ఆల్ఫ్రెడ్ రాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని జూనియర్ కళాశాల ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజును శనివారం ఎమ్మిగనూరు ఫుట్ బాల్ క్లబ్ తరపున ఘనంగా సన్మానించారు. ఇటీవల విజయవాడలో వరదలు సంభవించడంతో ఎమ్మిగనూరు నుంచి డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు సేవా దృక్పథంతో దాదాపు రూ.10 లక్షల విలువ చేసే దుప్పట్లు, ఆహార పదార్థాలు, వస్తు సామగ్రిని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆల్ఫ్రెడ్ రాజు గత 40 ఏళ్ల నుంచి అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తూ కులం, మతం, వర్గ భేదం లేకుండా పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలుస్తున్న గొప్ప మానవతా వాది అని తెలిపారు. వైఈసి సీనియర్లు ప్రసాద్, విక్రమ్, ముని, రఘు, ఈరన్న, శ్రీనివాసులు, శ్రీరామ్, చాంద్, జిసి.ఈరన్న, నసరుల్లా బేగ్, మల్లెల గ్రూప్ సభ్యులు జడ రవి మాదిగ, న్యూ లైఫ్ సామ్యేల్, సతీష్ పాల్గొన్నారు.



ఆల్ఫ్రెడ్ రాజు సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనుమతి లేనిదే నిర్మాణాలు చేపట్టరాదు

- సిటీ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణ సింగ్

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని ఆదోని సిటీ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణ సింగ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారని, ఆయన స్థానంలో ఆదోని సిటీ ప్లానింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్నామని, కడప నుంచి ఇక్కడికి వచ్చామని తెలిపారు. ఎవరూ అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు. ఏదైనా నిర్మాణాలు చేపట్టాల్సి వస్తే ప్రభుత్వ నిబంధనలకు లోబడి చేపట్టాలన్నారు. అక్కడక్కడ అక్రమ నిర్మాణాలు ఉన్నాయని తెలుస్తోందన్నారు. వాటి గురించి పూర్తిగా సమాచారం సేకరించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బాల మద్దయ్య

ఆదోని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బాల మద్దయ్య బాధ్యతలు చేపట్టారు. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేసి, అక్రమ కట్టడాల గుర్తింపు, కొత్తగా నిర్మాణాలకు తీసుకోవాల్సిన అనుమతి గురించి వివరిస్తామన్నారు. అందరికీ అందుబాటులో ఉంటామని, అనుమతి కోసం నిర్మాణదారులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో

8న జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 8న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, సన్ కిసాన్ అగ్రి అండ్ కో, నవ భారత ఫర్టిలైజర్స్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువత పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ, చదివి 19 - 35 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎంపికయిన అభ్యర్థులకు నెలకు రూ.10 నుంచి రూ.15వేల వరకు జీతం ఉంటుందని అన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9010003132 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాయితీ శనగ విత్తనాలు మంజూరు

- ఎఒ సురేష్‌బాబు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండలానికి 520 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని ఎఒ సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. నల్ల రేగడి భూములు కలిగిన తెర్నేకల్లు, పొట్లపాడు, పాలకుర్తి, కుంకనూరు, వెలమకూరు, అలారుదిన్నె గ్రామాల్లో విత్తనాలు వేసే రైతుకు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. క్వింటా శనగ విత్తనాల ధర రూ.9,400 కాగా రాయితీ రూ.2,350 పోను రూ.7,050లు రైతు చెల్లించాలని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజకీయాలకతీతంగా దళితుల అభ్యున్నతికి కృషి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - కోసిగి

రాజకీయాలకతీతంగా దళితుల అభ్యున్నతికి కృషి చేద్దామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు తెలిపారు. శనివారం కోసిగి మండలం కందుకూరు గ్రామంలో ఏర్పాటుచేసిన కెవిపిఎస్ నూతన పోల్ వద్ద జెండాను ఆనంద్ బాబు ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలోని బస్టాండ్ సెంటర్ నుంచి గ్రామ వీధుల గుండా ఎస్సీ కాలనీ వరకు డప్పుల దరువులతో వందలాదిమంది కెవిపిఎస్ పతాకాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఎస్ఐ చర్చి పక్కన కెవిపిఎస్ గ్రామ నాయకులు అయ్యన్న అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఆనంద్ బాబు, సర్పంచి తాయన్న, వైసిపి మండల నాయకులు బెట్టప్ప గౌడ్, టిడిపి నాయకులు బసవన్న గౌడ్, అయ్యన్న, కెవిపిఎస్ కోసిగి, మంత్రాలయం, కౌతాళం మండల కార్యదర్శులు రామకోటి హనుమంతు, గర్జి అంజి, హెచ్.చిన్న మారయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్, వ్యకాస నాయకులు నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడారు. రాజ్యాంగపు హక్కులతో పాటు పోరాడి సాధించుకున్న చట్టాలు, జిఒలు ఎన్ని వచ్చినా దళితుల బతుకుల్లో పరిపూర్ణమైన మార్పు నేటికీ సాధ్యం కాలేదన్నారు. ఉద్యమ ఫలితంగా సాధించిన డప్పు, చర్మకారుల పెన్షన్‌లోనూ రాజకీయ జోక్యం సరికాదన్నారు. కెవిపిఎస్‌గా పోరాడి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సాధించినా, నిధుల కేటాయింపులోనూ, కేటాయించిన నిధులను దళితుల ప్రత్యక్ష ప్రయోజనాలకే ఖర్చు చేయడంలోనూ లోపం కొనసాగుతోందని తెలిపారు. కెవిపిఎస్ మండల నాయకులు ముక్కరన్న, ఆర్.హనుమంతు, ఫిలిప్, జోజప్ప, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు జయన్న, వసంత్, నాయకులు శంకరప్ప, తిమ్మప్ప, శాంతప్ప, 250 మంది కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

నూతన మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎక్సైజ్ శాఖాధికారి లలిత దేవి

ప్రజాశక్తి - ఆలూరు

ప్రభుత్వ నూతన మద్యం విధానంలో భాగంగా మద్యం షాపుల ఎంపిక కోసం ఆసక్తి గల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ లలిత దేవి, సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం షాపుల ఎంపిక ప్రక్రియలో పాల్గొనే వ్యక్తులు దరఖాస్తులను దాఖలు చేయడానికి అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేదా జిల్లాలోని 7 ఎక్సైజ్ స్టేషన్లలోని కౌంటర్ల వద్ద రిజిస్ట్రేషన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 5 మండలాలకు గాను 9 షాపులను గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 9న సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందని అన్నారు. దరఖాస్తు దారుడు ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

అన్నపూర్ణ దేవి అలంకరణలో గాయత్రీ మాత

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని రామతీర్థంలోని కొండపై కొలువై, శ్రీగాయత్రీ మాత దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు రూపమోహన్ ఆధ్వర్యంలో గాయత్రీ మాతకు గంగ పూజ, బిల్వార్చన, అభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు. మూడోరోజు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ సతీమణి పరిమళ, కుమార్తెలు గాయత్రీ మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మాధవరావు దేశాయ్‌ని కలిసిన పిఆర్ ఎఇ

ప్రజాశక్తి - నందవరం

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీరాజ్ ఎఇ నరసింహులు టిడిపి నాయకులు మాధవరావు దేశాయ్‌ని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి కృషి చేయాలని మాధవరావు దేశాయ్ పిఆర్ ఎఇ నరసింహులుకు తెలిపారు. అనంతరం పిఆర్ ఎఇకు మాధవరావు దేశాయ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపిటిసిలు ప్రజా సమస్యలపై మాట్లాడాలి

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఎంపిటిసి సభ్యులు ప్రజాసమస్యలపై సమావేశంలో మాట్లాడాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం ఎంపిపి హాలులో ఎంపిపి శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే ఎంపిటిసి సభ్యులు వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వివిధ శాఖల సమస్యలపై మాట్లాడటం నేర్చుకోవాలన్నారు. సమస్యలు తెలియజేసినప్పుడే పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. మండల అభివృద్ధే లక్ష్యంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జడ్‌పిటిసి రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు ఇర్ఫాన్ దేశాయ్, ముత్తమ్మ, ఇఒఆర్‌డి జయరాముడు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం

పెద్దకడబూరులో ఆదోని మధు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. వైద్య శిబిరంలో దాదాపు 170 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మధు హాస్పిటల్ వైద్యులు, గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ వి.విశ్వనాథ్, ఆర్థో పెడిక్ డాక్టర్ దేవనగౌడ్‌లు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బి.చంద్రశేఖర్ రెడ్డి, దొడ్డిమేకల సర్పంచి చంద్రశేఖర్, వైసిపి నాయకులు శివారెడ్డి, ముక్కరన్న, అర్లప్ప పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

బెదిరింపులు, దాడులు వైసిపి నైజం : టిడిపి

ప్రజాశక్తి - దేవనకొండ

బెదిరింపులకు పాల్పడడం, దాడులు చేయడం వైసిపి నైజమని టిడిపి మండల నాయకులు బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, కప్పట్రాళ్ల మల్లికార్జున, వెలమకూరు సర్పంచి భాస్కర్, వెంకట స్వామి గౌడ్ విమర్శించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని జిల్లేడుబుడకల గ్రామ సమీపంలో గాలిమరల ఆఫీసు సిబ్బందిపై వైసిపి నాయకులు దాడులు చేస్తే టిడిపి నాయకులు దాడి చేశారని ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బెదిరింపులకు పాల్పడడం, మాట వినకపోతే దాడులు, రౌడీయిజం చేయడం వైసిపి నాయకులకు పరిపాటిగా మారిందని విమర్శించారు. టిడిపి అంటేనే క్రమశిక్షణకు మారుపేరని గుర్తు చేశారు. వైసిపి నాయకులు దాడులు చేసి టిడిపి నాయకులపై నెడితే ఊరుకోబోమని హెచ్చరించారు. బిజెపి మండల అధ్యక్షులు రవికుమార్, టిడిపి నాయకులు బండ్లయ్య, రాజా సాహెబ్, గిడ్డయ్య గౌడ్, ఖాసీం, బండపల్లి శ్రీను, తిమ్మయ్య, బాలకృష్ణ, రంగన్న పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యేపై కోనేరు విమర్శలు తగదు : టిడిపి

ప్రజాశక్తి - నందవరం

మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ ఎమ్మెల్యే బీవీని విమర్శించడం తగదని టిడిపి మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఖాసీంవలీ, మండల కన్వీనర్ చిన్నరాముడు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు వైసిపి నాయకుల దగ్గర డబ్బులు తీసుకొని వైసిపికి కోవర్టుగా పని చేసిన కోనేరు నాగేంద్ర ప్రసాద్ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డిపై విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు. వైసిపి నాయకుల మెప్పు కోసమే ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎత్తిపోతల పథకం నిధుల కోసం ఎమ్మెల్యే ఎక్కడా ప్రయత్నం చేయడం లేదని కోనేరు నాగేంద్ర ప్రసాద్ అనటం సరైనది కాదన్నారు. గురు రాఘవేంద్ర ఎత్తిపోతుల పథకంలో దొంగలు పడి దాదాపు రూ.15 కోట్ల నష్టం వాటిల్లిందని, ఆ నిధుల కోసం సంబంధిత అధికారులను ఎమ్మెల్యే సంప్రదించారని తెలిపారు. గతనెలలో నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల నాయుడును కర్నూలులో కలిసి పరిస్థితిని ఆయనకు వివరించారని అన్నారు. పత్తికొండలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు మరమ్మతులకు నిధులను కేటాయించాలని చంద్రబాబు నాయుడును కోరారని తెలిపారు.



శాంతి రాజుపై దాడి చేసిన

వారిని అరెస్టు చేయాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - ఆదోని

శాంతిరాజుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. దాడికి గురై ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శాంతి రాజును ఆనంద్‌బాబు, కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప, మండల నాయకులు వీరేష్, రంగముని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడారు. ఆదోని మండలం కడితోట గ్రామంలోని తన 2.50 ఎకరాల పొలంలో పత్తి, మిరప పంట వేసుకొని శాంతి రాజు జీవిస్తున్నారని తెలిపారు. ఆయనను చూసి ఓర్వలేక ట్రాక్టర్‌ను అడ్డంగా పంట మీదుగా తీసుకెళ్లడమే కాకుండా 'ఆపి ఇలా ఎందుకు చేశారు' అని అడిగినందుకు శాంతి రాజుపై చెలకపారతో దాడి చేశారని చెప్పారు. దాడి చేసిన రాముడు, బ్రహ్మయ్య, ట్రాక్టర్‌ను నడిపిన డ్రైవర్ అంజిపై అట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని పోలీసులను కోరారు. అట్రాసిటీ సమస్య ఉన్న గ్రామాల్లో ప్రతి నెలా చివరి వారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నా అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఉన్నతాధికారులను కలిసి సమస్యలు విన్నవిస్తామన్నారు. **గోనెగండ్ల**లో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ మాట్లాడారు. శాంతిరాజుపై దాడి చేసిన రాముడు, బ్రహ్మయ్యతోపాటు ట్రాక్టర్ డ్రైవర్ అంజినిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



బాధితుని పరామర్శిస్తున్న ఆనంద్‌బాబు

'మా స్థలం మాకు ఇప్పించండి'

ప్రజాశక్తి - చిప్పగిరి

పూర్వీకుల ఆస్తి అయిన తమ స్థలం తమకు ఇప్పించి, న్యాయం చేయాలని బంటనహాల్ గ్రామానికి చెందిన రంగన్న కోరారు. శనివారం తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బంటనహాల్ గ్రామానికి చెందిన తనకు కుటుంబీకులకు సంబంధించిన 9 సెంట్ల స్థలంలో ఆరు సెంట్లలో సొంత ఇంటిని నిర్మించుకున్నామని తెలిపారు. మిగతా మూడు సెంట్లను ఖాళీగా ఉంచామని చెప్పారు. ఆ ఖాళీ స్థలంలో లక్ష్మి, చిన్న ఆంజనేయ దంపతులు రేకుల షెడ్డు వేసుకున్నారని తెలిపారు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేటప్పుడు వదిలి వెళ్తామని చెప్పి ఇప్పుడేమో 'ఈ స్థలం మాదే. మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా గ్రామ సర్వేయర్‌తో కొలతలు వేయించడం ఎంతవరకు సమంజసం' అంటూ, ఇదే స్థలం కొలతలు వేయాలని పలుమార్లు గ్రామ సర్వేయర్‌కు విన్నవించినట్లు తెలిపారు. అక్రమ దారులకు వత్తాసు పలుకుతూ తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. తమ స్థలం తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం జరగకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయపరంగా వెళ్తామన్నారు.